# ఇంద్రప్రస్థంలో సీమంతం

విజయశ్రీ

సుభద్రార్జునుల పరిణయం అతి వైభవంగా జరిగింది.

వచ్చిన బంధువులు, అతిథులు వెళ్లిపోయారు. అయిదు నెలలు గడచినా పెళ్లినాటి మహోత్సవాలను ఇంకా పురజనులు మరచిపోనేలేదు. ఇంద్రప్రస్థపురం శృంగారవైభవంతో ధగద్ధగాయమానంగా ప్రజ్వరిల్లుతోంది. చలువరాళ్ళతో కట్టిన మేడలు రెండు పక్కల బారులు తీరిన వీధులతో సంపదలకు, విలాసములకు, కళలకు ఉనికిపట్టయి విరాజిల్లుతోంది ఆ మహానగరం.

ద్వారకానగరానికి ముద్దుచెల్లెలు ఇంద్రప్రస్థపురం అంటారు అందరూ. ద్వారకా నిర్మాణం అయింతర్వాత తన పురనిర్మాణ కౌశలమంతా మరొక్కసారి ప్రపంచానికి ప్రకటించాలనే కుతూహలంతో దేవతలశిల్పి విశ్వకర్మ ఆహ్వానం రాగానే కాదనకుండా తన పరివారమంతటితోటి భూలోకం వచ్చి నిర్మించాడుట ఈ నగరాన్ని పాండవులకోసం. దేవేంద్రుడు, శ్రీకృష్ణుడు - ఇద్దరూ విశ్వకర్మ సృష్టిని చూసి మరొక మన్వంతరంలో కాని ఇటువంటి 'రచన' మరొకటి ఉండదన్నారట.



సుభద్రార్జునులు ప్రేమాతిశయంతో సంతృప్తితో యుగం క్షణంగా దాంపత్య సౌఖ్యము లనుభవిస్తున్నారు.

"మృగమదము చెంతఁ గుంకుమరేకవోలె,
నీలమణిపొంత నుదిరి పొన్రెకు వోలె,
మేఘము కుఱంగటను దీఁగ మెఱపు వోలె,
నర్జునుని చెంగట సుభద్ర యలరె నపుడు."

"సతియు పతియును నారామతతుల నతుల
రతులఁ బెసగిరి చతురత లతిశయిల్లఁ; ...

సుభద్ర గర్భవతి అయింది.

"నెలమసలెనంత కాంతకు,
నెలకొనె వేవిళ్లు పెల్లు, నిద్దపు మేనన్
దలతలమని మెయిపూతలఁ
దళదళ దళుకొత్త గ్రొత్తధవళిమ దోఁచెన్.

కలదొలేదో యను కౌను గానంగ నయ్యె,
తెప్పల నలసత గప్పుకొనియెఁ.
గులుకు జన్నెబ్బలు వలుఁదలై మెఱుఁగెక్క.
నూగారు పైగప్పు నూలుకొనియెఁ,
జెక్కుటద్దంబుల నెక్కొనెఁ దెలినిగ్గు,
బడలిక నడుపులఁ గడలుకొనియెఁ.
జిట్టూట చెమటల చిత్తడి మెయినిండె,

సారెకు మూర్ఛలు సందడించె,
నరుచి గన్పించె, నొక చెల్వ మంకురించె,
తరులు సమమయ్యెఁ, జిట్టుముల్ దళచుమీఱె,
మొలచెఁ గోర్కులు, నెమ్మెన నిలిచె నలఁత,
నెలఁత కేర్పడెఁ దొలు చూలు నిలుచు నపుడు."

కుంతీదేవి అయిదుమాసాల గర్భవతియైన తన కొత్తకోడలు సుభద్రను చూసుకొని మురిసిపోతోంది. ద్రౌపది మనస్సు కొంచం చివుక్కుమంది పాండవవంశకర్తను తను మొదట ధరించగల భాగ్యము కలుగలేదేమో? అని. తన్ను తనే సముదాయించుకుంది. సుభద్ర తనకి ముద్దు చెల్లెలి వంటిది. సుభద్రార్జునుల వివాహ మహోత్సవ సమయంలో కృష్ణుడు తనకి చెప్పిన రహస్యం గుర్తు పెట్టుకుంది. "నీవు సుభద్ర వంటి దానవు నాకు. మీరిద్దరిని ఒకే రకంగా చూసుకుని రక్షించుకుంటాను" అన్న కృష్ణుని మాటలు పదే పదే స్మరించుకుంది. అందుకనే తన సవతి అనే భావమే తనమనస్సులో ప్రవేశించకుండా ద్రౌపది తన ముద్దుచెల్లెలి కెటువంటి నలత కలుగకుండ చూసుకుంటోంది. పైగా చనువు దీసుకొని తనే అర్జునుని "నీ సుభద్రను మక్కువలు తక్కువకాకుండ చూసుకోవలె"అని హెచ్చరిస్తుంది అస్తమానూ.

సుభద్రకి అయిదవనెల అని తెలిసిన వెంటనే ద్వారకలో అన్నలు బలరామ కృష్ణులు తల్లి దేవకీదేవి దగ్గరకి వెళ్లి సంప్రదించారు. తండ్రి వసుదేవుని అనుమతి తీసుకున్నారు. "మా చెల్లెలికి సీమంతోత్సవం జరపడానికి సమయం ఇది. మే అందరం తరలి వస్తున్నాం. తగిన ఏర్పాట్లు చేయించ గలరని ఆశిస్తున్నాం" అంటూ లేఖ పంపించారు పాండవ మధ్యముడికి.

తల్లి కుంతీదేవికి పట్టుకెళ్లి చూపించాడు లేఖ అందిన వెంటనే అర్జునుడు. పక్కనున్న ధర్మతనయుడు వెంటనే తన సంతోషం ప్రకటించాడు. "అమ్మా ఇది మనమే ముందుగా అనుకొని వాళ్లందరిని ఆహ్వానించవలసింది" అన్నాడు. "సర్వజ్ఞుడైన కృష్ణమూర్తికి ముందు చెప్పగలిగే వాళ్లెవరున్నారు నీ భ్రమ గాని " అంది చిరునవ్వు నవ్వుతూ.

వ్యాసమహర్షికి కబురు పంపింది కుంతీదేవి వెంటనే. సుభద్ర గర్భంలో తనకి మనవడు పెరుగుతున్నాడో మనవరాలు పెరుగుతోందో తెలుసుకోవాలని ఆతురత. భూత భవిష్యద్వర్తమనాలు తెలుసుకోగల సర్వజ్ఞుడు వ్యాసుడు అనుమానం లేకుండా తన దివ్యదృష్టి ప్రభావంతో తెలుసుకుని చెప్పాడు "నీకు మొదటి మనవడు సుభద్ర గర్భస్థుడే, సంతోషించు" అని. మనవణ్ణి గురించి ఇంకా ఇంకా తెలుసు కోవాలని కుతూహలం ఉన్నా పైకి అడగలేదు. ఆమెకు కుతూహలంగా ఉందని తెలిసినా వ్యాసుడు మరింకేమి మనవణ్ణి గురించి చెప్పలేదు. "ఈ పాండవ వంశకర్త ని అందరూ అభిమన్యుడని సంబోధిస్తారు" అని మాత్రం చెప్పాడు. తనకి మొదటి మనుమడు రాబోతున్నాడని పరమానంద భరితురాలయింది. ఈ విషయం తన మనస్సులోనే దాచుకుంది. మరెవ్వరికి చెప్పలేదు.

ధర్మతనయుడు వెంటనే రాజశాసనం ప్రకటించాడు. ఇంద్ర ప్రస్థపురం అలకాపురి కన్న అధికంగా అలంకరించబడాలి అని.

తరలి వస్తున్న యాదవకులాధిపతులందరికి విడిదలు సకల సదుపాయాలతో రమ్యంగా అనుకూలంగా నిర్మించమని ఆదేశించాడు. ఆ పనులన్నీ సమర్థతతో చూడటానికి నకుల సహదేవుల్ని అడిగాడు.

అలకాపురినుంచి వచ్చిన అమరగణాలకి అనువుగా సువర్ణ ఖచిత శిఖరాలతో శిబిరాలు నిర్మించమని భిమసేనునికి అప్పచెప్పాడు బాధ్యత.

సీమంతోత్సవ కార్యక్రమాలకి ఆధ్వర్యం వహించి అన్ని సంస్కారాలు సవ్యంగా జరపటానికి పురోహితులు ధౌమ్యుని ముందుగానే ఆహ్వానించి ఒక ప్రత్యేక వసతిలో ఉంచి వారి నిత్యాగ్నిహోత్ర కర్మలకి ఏవిధమైన లోటు రాకుండా తనే స్వయంగా చూసుకుంటున్నాడు

భాద్రపద పౌర్ణమి. రాకా శశికళా కాంతులు వెదజల్లిన తెల్లదనానికి పురమంతా వెండి పళ్లెంలా ప్రకాశిస్తోంది. పురమంతా కొత్తశోభలతో పండుగ చేసుకుంటున్నట్లుంది. ఆకాశమార్గంలో దివ్యవిమాన రూఢులై దేవతలు ఒకరి తర్వాత ఒకరు వస్తున్నారు. పురం చుట్టూ కందకం. ఆ కందకంలో ప్రతిబింబించే కొటగోపురాల వరుసలు ఆకాశాన్ని తాకుతూ స్వర్గమే ఆక్రమించుకుంటాయేమో ననుకుంటున్నారు.

మా తనయుని మొదటి సంతానానికి శుభసంస్కారములు చేసి మా కోడలు సుభద్రను దీవించుటకు రండని సురాధినాథుడు దేవగణములందరికి తనే స్వయంగా శుభరేఖలు పంపాడు. అందుకనే ఆనాడు ఇంద్ర ప్రస్థపురోపరిభాగ గగనమంతా కిక్కిరిసి పోయింది దివ్యవాహనాలతో. ఐరావతం దిగిన శచీదేవి, దేవేంద్రులను అప్పటికే వచ్చిన శ్రీకృష్ణుడే తన జమహిషులతో సహా స్వయంగా ఆహ్వానించి వారిని వారి విడిది దగ్గరకి తీసుకువెళ్లాడు.

యదు, వృష్ణి, భోజ కులజులందరూ ద్వారకనుంచి తరలి వచ్చారు. చతురంగ బలాలు - ఏనుగులు, గుఱ్ఱాలు,రథాలు, పదాతులు - వెనుక నడుస్తుంటే,పితృ,పుత్రి, పౌత్రి, మిత్రులు, వసుదేవుడు, అక్రూరుడు, సారణుడు, సాంబుడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు సహితంగా వెంటరా బలరామ, కృష్ణులు సమస్త వస్తు ధన సంపదలు బహుమతులు పట్టుకుని వచ్చారు వేళకి.

సూర్యోదయమైన వెంటనే కుంతి, దేవకి, శచీ, ద్రౌపది, రేవతి, రుక్మిణీ సత్యభామాది అష్టమహిషులూ, అందరూ కలిసి,

"కట్టిరి మంచి లగ్నమునఁ గంకణముల్ కర పంకజంబులన్
బెట్టిరి మేనులన్ నలుఁగు మేలి మృగీమద కుంకుమంబులన్
జుట్టిరి కైశికంబుల విశుద్ధ మనోహర పుష్పమాలికల్,
పట్టిరి పేరటాండ్రు ధవళంబులు పాడుచు నుల్లభంబులన్."

అటు పాండవులు, యిటు దేవతలు, మరొకప్రక్క యాదవులు, కౌరవులు - వారి మధ్య సర్వాలంకారలములతో విరాజిల్లుతున్న శోభన మంటపం. ధౌమ్యుడు పాండవుల పురోహితుడు ఒక ప్రత్యేక ఆసనం మీద కూర్చున్నాడు. అతనికి ఒక ప్రక్క యాదవుల పురోహితుడు గర్గుడు, మరొక ప్రక్క దేవతల పురోహితుడు బృహస్పతి. సీమంతానికి బృహస్పతే లగ్నం పెట్టి ముహూర్తం పెట్టాడు, దేవేంద్రుని పురమాయింపుతో.

కశ్యప ప్రజాపతి హోమకర్తగా పితృదేవతలకి సంతృప్తిగా అంతకుపూర్వమే హోమాలు జరిగాయి.

"ఓంగణానాం త్వా గణపతిగ్ం హవామహే" అంటూ అందరితరఫున మహాగణాధిపతిని ఆహ్వానించి నమస్కరించి పూజచేశాడు ధౌమ్యుడు.

"ఓం పుణ్యాహం భవంతో బ్రువంతు" అన్నాడు ధౌమ్యుడు ఆసీనులయిన అతిథులందరిని ఉద్దేశించి. వారు తిరిగి "ఓం పుణ్యాహం" అన్నారు. అలా మూడుసార్లు ధౌమ్యుడు వారిచే పలికించి సంతృప్తిపొందాడు. సర్వదేవతా నమస్కారం చేసి సంజ్ఞచేశాడు.

దేవకిదేవి కొత్తపెళ్లికూతురుగా విరాజిల్లుతున్న సుభద్రని నెమ్మదిగా నడిపించి తీసుకొచ్చి మంటపంమధ్యనున్న సింహాసనంలో కూర్చోపెట్టింది. ఆమె ప్రక్కనే కుంతీదేవి వచ్చి నిలబడింది. ఒకరి తరువాత ఒకరు శ్రీకృష్ణుని అష్టమహిషులు వచ్చి వెనుక నిలబడ్డారు. ద్రౌపది ఒకసారి అర్జునునికేసి చూసి చిరునవ్వు నవ్వి సుభద్ర దగ్గరకు చేరి తనమెడలోని ముత్యాల హారాన్ని తీసి సుభద్ర మెడలో వేసింది.

అర్జునుడికి ద్రౌపదిపై గల ప్రత్యేక ప్రేమ తోబాటు భయంకూడా. ద్రౌపది దివ్యశక్తి సంభూతురాలు. ఆవిడ ఏ మాట అన్నా నిజమవుతుందట. అందుకనే ఆవిడకి కోపం తెప్పించకుండా నడుచుకునేవారు పాండవులందరు. సుభద్రని వివాహం చేసుకొని ద్వారకనుంచి వచ్చేముందు ఆ భయంతోనే తనొక నాటకమాడవలసి వచ్చింది. తనకు సవతిగా సుభద్రని పరిచయం చేస్తే ద్రౌపది కోపంతో ఏ చెడుమాట లంటుందోనని భయపడ్డాడు. తనకంటె ముందుగానే సుభద్రని గోపికావేషంలో రుక్మిణికి తోడుగా పంపించి ద్రౌపదికి పరిచయం చేసి ఆమె సుభద్రను దీవించే టట్టు చేస్తాడు. ఇప్పుడు స్వయంగా తనే వెళ్లి సుభద్రని దీవించి అలంకరించినందుకు ద్రౌపదిని మనస్సులో ఎంతో మెచ్చుకున్నాడు.

ధౌమ్యుడు మరొక సంజ్ఞ చేశాడు

శ్రీకృష్ణుడు తన అన్నగారయిన బలరామునికి నమస్కారం చేసి అర్జునుని దగ్గరకు చేరి అతన్ని లేవమని చెయి చాపుతాడు. ఈ క్షణంకోసమే తనూ ఎదురు చూస్తున్నట్లు వెంటనే లేచి ఒక క్షణం ఆలోచించి దేవేంద్రులకు, గురువులకు, పితామహునికి, వసుదేవునికి అన్నగార్లకు, బలరామునికి వరుసగా నమస్కరించి తల్లి కుంతీదేవి దగ్గరకు పోయి ఆమె ఆశీర్వాదము గ్రహించి సుభద్రను సమీపిస్తాడు.

సుభద్ర శిరోజాలను తన రెండు చేతులతో పాయలుగా విడదీసి, సిగ్గుతో వంచిన ఆమె ముఖాబ్జమెత్తి, కృష్ణుడందిచ్చిన ధర్భలు మూడు తీసుకుని ముఖము ముందునుంచి వెనుకకు జడలవరకు వాటితో తాకి, రుక్మిణి అందిచ్చిన సిందూరముతో సుభద్ర కనుబొమల మధ్య తిలకము దిద్ది, ధౌమ్యుడుకేసి చూశాడు.

ధౌమ్యుడు తన దగ్గరే ఉన్న వెండి పాత్రలోంచి మూడు ఉడుంబరకాయలు బంగారుగొలుసుకి కట్టినవి తీసి అందరికీ చూపించాడు. శ్రీకృష్ణుడా గొలుసు తీసుకొని కాస్సేపు పరీక్షగా చూసి చిరునవ్వు నవ్వి అర్జునుడికి ఇచ్చాడు. అర్జునుడా కాయలను సుభద్ర మెడలో కడతాడు. వెనుక నిలబడ్డ దేవకి సుభద్ర శిరోజాలు సర్దుతుంది, ఆ బంగారు గొలుసు వాటిలో చిక్కు పడకుండా. పెళ్లిలో ద్వారకలో తను సుభద్ర మెడలో మంగళసూత్రాలు కడుతున్న మధురక్షణాలు గుర్తుకు వచ్చాయి అర్జునుడికి.

శ్రీకృష్ణుడి సంజ్ఞలగ్రహించి అర్జునుడు సుభద్ర పక్కనే కూర్చుంటాడు మక్కువతో ఆమె చేతులు పట్టుకుంటూ.

కాచి వడపోసిన నెయ్యి కలిపిన పరమాన్నం వెండిగిన్నెలో పట్టుకొచ్చి రుక్మిణీదేవి కృష్ణుడికి అందిస్తుంది. కృష్ణుడు దాన్ని అర్జునుడికిస్తాడు. అర్జునుడు తన వేళ్లతో కొంచంకొంచంగా ముద్దలు తీసి సుభద్రకి తినిపిస్తాడు. సాహసి ధైర్యవంతురాలయిన సుభద్ర తనుకూడా రెండుసార్లు అర్జునునికి తినిపిస్తుంది. ఆ ముచ్చటల చూసిన అత్తలిద్దరూ సుభద్రని మెచ్చుకుంటారు.

బృహస్పతి ఆశీర్వాదం చెబుతాడు.

శచీదేవి, దేవేంద్రులిద్దరూ వచ్చి స్వర్గంనుంచి తాము తెచ్చిన పారిజాత పుష్పాలతో సుభద్రని అర్జునుని దీవిస్తారు.

అందరి ఆశీర్వాదాలు అయ్యేసరికి పాపం సుభద్రార్జునులకి నీరసం వస్తుంది. శ్రీకృష్ణుడికేసి దయచూపమంటూ బతిమాలుకుంటున్నట్లు చూస్తారు.

వెంటనే తన పిల్లనగ్రోవిని తీసుకుని మధురమైనదీ, శ్రావ్యమైనదీ ఒక రాగాన్ని ఆలాపిస్తాడు. దేవకి వసుదేవులా వేణుగానాన్ని వినగానే అనుకున్నారు ఇది సుభద్రకి తన ప్రియమైన అన్నగారిచ్చుకునే హృదయపూర్వక అభినందనమని. అందరిలో అంత తనివిదీర ఆనందంతో కృష్ణుడు వేణువు వాయించి ఎన్నిరోజులయిందో. ద్రౌపదీస్వయంవరం అయ్యాక బావలు పాండవుల సంసారం చూడడానికి వచ్చినపుడు కుంతీదేవి మనస్సు శాంతింప చేయటానికి వేణువు నూదాడు. మళ్లీ కృష్ణుడివేణువుని విన్న కుంతీదేవి ఆనంద భరితురాలయింది.

దేవలోకంనుంచి తరలివచ్చిన అప్సరసలందరు రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమలతో సహా ఇంద్రుని అనుమతి తీసుకుని తమ నృత్యగానాలతో సదస్యులందరిని ముగ్ధులనిచేసి సంతృప్తి పరుస్తున్నారు.

* * *

మంటపంలో సుభద్రార్జునులని వదలి బంధుమిత్రులని పలకరించటానికి కృష్ణుడు తన సతులతో కలసి వెళ్లిపోయాడు. చుట్టూ ఉన్న ఇతరులుకూడా కబుర్లు చెప్పుకుంటున్న వారిద్దరిని వదలి ఇతరపనులలో నిమగ్నమైపోయారు.

అర్జునుడు తన తీర్థ యాత్రావిశేషాలు ఒకొకటి గుర్తు తెచ్చుకుంటూ కుతూహలంగా వింటున్న సుభద్రకి మరింత రక్తి గట్టేటట్టు వర్ణిస్తూచెబుతున్నాడు. ఆ మాటల ధోరణిలోనే తను నేర్చుకున్న విద్యలగురించి ప్రస్తావన వచ్చింది. సుభద్రకి ఇంకా కుతూహలం ఎక్కువయింది. తనుకూడా విలువిద్య నేర్చుకుని అస్త్రవిద్యా పాండిత్యం గణించి, ధనుర్వేద నిక్షిప్తమయిన రణగంగ వ్యూహనిర్మాణ పద్ధతులు గ్రహించినట్లయితే తన భర్తకి అన్నివిధాలా చేదోడుగా ఉండవచ్చుగదా అని ఆమె ఆకాంక్ష. అందుకనే వ్యూహాలగురించి ప్రశ్నలు వేసింది. తనకు తెలిసిన వన్నీ పూసగుచ్చినట్లు చెప్పటం ప్రారంభించాడు.

ఇలా సంభాషణలో నిమగ్నులయిపోయిన సుభద్రార్జునులని చూసి కొందరు విస్తుపోయి చూచిన వారున్నారు. ఇంకా కొత్తదంపతులులా ఎన్ని కబుర్లు చెప్పుకుంటున్నారో అని ముగ్ధులయ్యారు కొంతమంది.

స్వర్గలోకానికి తిరిగి పోయే సన్నాహంలో ఉన్న దేవేంద్రునితో కబుర్లలో మునిగిపోయిన కృష్ణుని చెయినొక్కి పక్కనే ఉన్న జాంబవతి, "చూడండి మీ చెల్లెలు ఎంత పరవశమయిపోతోందో అర్జునుని మాటలు వింటో" అంది.

వెనక్కి తిరిగి చూశాడు సుభద్రార్జునులకేసి. మరుక్షణంలో సర్వజ్ఞుడైన కృష్ణుడు ప్రమాదం గుర్తించాడు. దేవేంద్రునితో మాటలు వెంటనే ఆపి, జాంబవతిని తన ఎడమచేతితో లాగుతూ పెద్ద పెద్ద అడగులు వేసుకుంటూ అర్జునుని వైపు వెళ్లాడు.

దేవేంద్రుడు ఆశ్చర్యంతో శచీ దేవి వైపు తిరిగాడు. తనకేమి తెలీదన్నట్లు తల వూపిందామె.

జాంబవతితో కలిసి పరుగెడుతున్న తమ మగని చూసిన రుక్మిణీ సత్యభామలు సంభ్రమాశ్చర్యాలతో అటు చూడటం ప్రారంభించారు ఏం జరుగుతుందోనని.

ఒక్క క్షణంలో అర్జునుని సమీపించిన కృష్ణుడు అతని చెయ్యిపట్టుకుని తనవైపు మంటపంనుంచి కిందకి దింపి నడిపించాడు. ''అదేమిటోయి, పితృసమానులు దేవేంద్రులు తిరిగి వెళ్లిపోతున్న సన్నాహంలో ఉన్నారు. వెళ్ళిమర్యాదగా సాగనంపడం మంచిది.'' అంటూ అతన్ని దేవేంద్రుని వైపుకి తోశాడు.

వెనుతిరిగి సుభద్రను చూసి ''నీ గర్భస్థుడు నా మేనల్లుడు అదృష్టవంతుడు. విజయుడుకంటే వీరుడనిపించుకుంటాడు. నీవు వెళ్లి అమ్మతో కొంతసేపు గడుపు. మేము తిరిగి ద్వారకవెళ్ళే వేళయింది'' అన్నాడు. అంటూ చిరునవ్వుతో సిగ్గు పడుతున్న ఆమె ముఖాన్ని తన రెండు చేతులతో ఎత్తి తన ముద్దు చెల్లెలి మనస్సులో మళ్ళీ అర్జునుని పద్మవ్యూహం గురించి ప్రశ్న అడగకుండా ఉండేటట్లు మంత్రముగ్ధురాలినిగా చేశాడు తన మహిమతో. ఆ క్షణం గమనించినది జాంబవతి ఒకతే.

* * *

సీమంతోత్సవాలనంతరం అందరూ ఎవరి చోటకి వారు వెళ్లిపోయారు.

కష్ణుడు తన రథాన్ని తనే స్వయంగా తోలుకుని బయలుదేరాడు ద్వారకకి. తనతో ఉన్నది జాంబవతి మాత్రమే. జాంబవతి నెమ్మదిగా అడిగింది. తనకి తెలియకూడని విశేషం ఎలాగూ చెప్పడని తెలుసు. అందుకని ఏదో తోచక అడిగిన ప్రశ్నలా అడిగింది. ''గర్భంలో పిండరూపంలో ఉన్న జీవికి బాహ్యప్రపంచం గురించి ఏమయినా తెలుస్తుందా'' అని.

''గర్భప్రవేశానంతరం జీవి స్వరూపం దిన దినం మారూతూ భూప్రపంచంలో మనుగడకి కావలసిన శక్తి సామర్థ్యాలు క్రమక్రమంగా గ్రహించుకుంటుంది. కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాలతో స్థూలశరీరం ఒకపక్క పెరుగుతూంటే, అంతరింద్రియమైన మనస్సు తన పని అయిదవనెలనాటికే ప్రారంభిస్తుంది. మనస్సు ఇతర ఇంద్రియాలతోడు లేకుండానే బాహ్య ప్రపంచంలోని ప్రతి విశేషాన్ని గ్రహించటం ప్రారంభిస్తుంది. ఈ సంగ్రహణకి తోడుపడే తల్లి దండ్రులు అదృష్టవంతులు.'' అన్నాడు కృష్ణుడు గురువు శిష్యునికి బోధించినట్లు.

''అయితే మన సుభద్ర ఎంతో జాగ్రత్తగా ఉండాలికదా మరి!'' అంది జాంబవతి ఇంకా సంభాషణ పొడిగించే కుతూహలంతో.

''గర్భవతులయిన తన భార్యలు అదితి, దితులకి ప్రజాపతి కశ్యపుడు చక్కని సలహాలిచ్చాడు. ఆ సలహాలని పాటిస్తే మన సుభద్ర చాలా మంచిది. ఎల్లవేళల చక్కని పరిశుద్ధమయిన చోట్లనే మెలగాలి. ప్రమాదకరమైనవి, స్థిరములేనివి, ఎత్తుగానున్నవి – అటువంటి ఆసనాలపై కూర్చోకూడదు. అపవిత్రములైన వస్తువులను తాకటం, వాటి సమీపంలో తిరగటం చెయ్యకూడదు.

తను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలి. జుట్టు విరగ బోసుకుని తిరగ కూడదు శయ్యాతలంపై బోర్లగిల పడుకోకూడదు. ఉత్తర దిశగా తలపెట్టి పడుకోకూడదు. వివస్త్రయై పడుకో కూడదు. చక్కని సుగంధద్రవ్యాలు, ఔషధములు కలిపిన వెచ్చని నీళ్లతో నే స్నానంచేయాలి.

సంధ్యాసమయాలలో ఏమి భుజించకూడదు. చక్కని బలకరమైన భోజన పదార్థాలే తినాలి.

అస్తమాను నిద్రపోకూడదు. పగలు నిద్ర మానేయాలి. రాత్రుళ్లు నిద్రతప్పి మెలకువగా ఉంచే పనులు చేయకూడదు.

భౌతిక శరీరంతోపాటు, మనస్సేంద్రియాన్నికూడా జాగ్రత్తగా ఉంచుకోవాలి. మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఆమె మనస్సు కలవరపడే పనులు చుట్టు పక్కలవారు ఏమి చెయ్యకూడదు. ఈ విషయంలో అందరూ, ముఖ్యంగా భర్త ఆమెకు సహకరించాలి. గర్భవతిగా ఉన్నంతకాలం ఆమె కోర్కెలన్నీ తీర్చటానికి భర్త కృషి చెయ్యాలి. ఆమె కోర్కెలు తీర్చకుండా అసంతృప్తి కలిగిస్తే ఆమె కడుపులోని పిండంకూడా అసంతృప్తితో పెరిగి, అనారోగ్యంగా తయారవుతుంది.

భర్త కూడా తనకి ప్రమాదం కలిగే పనులేమి చేయకూడదు. భార్యను వదిలి ఇక్కడా అక్కడా తిరగ కుండా సర్వదా ఆమెకు సహచారిగా సహకరిగా ఉండాలి.''

జాంబవతి శ్రద్ధగా వింది.

''సుభద్ర అదృష్టవంతురాలు. అర్జునుడులాంటి భర్త, కుంతీదేవి వంటి అత్త ఉన్నారు. అన్నివిధాలా ఆమెను జాగ్రత్తగానే చూసుకుంటారు. కుంతీదేవి అయిదుగురు పిల్లలను కన్న తల్లి. ఆమెకు ఈ విషయాలన్నీ తెలిసే ఉంటాయి'' అంది.

కృష్ణుడు వెంటనే అన్నాడు. '' మా మేనత్త కుంతి గర్భధారణ దేవతాశక్తుల ప్రోద్బలం. ఇటువంటి జాగ్రతలేమీ అవసరం లేకుండానే అయిదుగురు పిల్లలూ వారివారి దేవతానుగ్రహాలవల్ల పిండోత్పత్తి జరిగి పెరిగారు. మన సుభద్ర విషయంలో అర్జునుడే అన్నివిధాలా బాధ్యత వహించాలి.''

''మరివిషయాలు బోధచేసి చెప్పారా మీరు మీ బావకి?''

''అతనితో కాలం గడపడానికే అవకాశం రాలేదు. ద్వారకలో తక్షణకర్తవ్యాలు నిర్వహించాక ఇంద్రప్రస్థం తిరిగి వచ్చి సుభద్రకు పురుడు వచ్చిందాకా అక్కడే ఉందామని అనుకుంటున్నాను.''

''అర్జునుడు చెప్పకూడని విషయాలు ఇంకా ఏమయినా పొరపాటుని సుభద్రతో అనేస్తాడనా మీ భయం?''

కృష్ణుడు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

పద్మవ్యూహం ప్రవేశించే వరకూ అర్జునుడు సుభద్రతో చెప్పేశాడు. దాన్నుంచి బయటపడే విధానం చెప్పేలోపుగా తను అడ్డుపడి ఆపుచేశాడు. లేకపోతే తన మేనల్లుడు అతి వీర పరాక్రముడై అర్జునుని కంటె మించిన వాడైపోయేవాడు. అతన్ని కట్టుదిట్టం చెయటానికి తను మరొక అవతారం ఎత్తవలసి వచ్చేది. ఇప్పటివరకూ తనకూ, అర్జునుడికీ, ప్రద్యుమ్నుడికి తప్ప మరెవరికీ పద్మవ్యూహ రహస్యం తెలియదు.

''మరి మేం ద్వారకలో ఒంటరిగా విరహం అనుభవించాలా మీకు మేనల్లుడు రాబోతున్నాడని?''

''ఒంటరిగా ఎందుకూ. ఇంకా ఏడుగురున్నారుగా సమిష్టిగా విరహం అనుభవించడానికి''

ఇద్దరూ ఒక్కసారి పక్కున నవ్వుకున్నారు.

రథం ముందుకు సాగింది మిగిలిన వారితో కలవటానికి.

* * *

ఇంద్రప్రస్థంలో పాండవ వంశకర్త అవతారానికి అందరూ ఎదురు జూస్తున్నారు. కృష్ణుని మాయనెరుగని సుభద్రార్జునులు సీమంతోత్సవానంతర తన్మయావస్థలో రాబోయే వంశోద్ధారకుని ఊహించుకుంటూ శృంగార విలాస మధురక్షణాలలో సంతృప్తి చెందుతున్నారు.

---

ఇందులో ఉదహరించిన పద్యాలు చేమకూరవేంకటకవి వ్రాసిన విజయవిలాసం అనే ప్రబంధం లోనివి.